ఊరూరా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- భక్తుల ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: క్రోధినామ ఉగాది సంవత్సరంను పురస్కరించుకుని మదనపల్లె పట్టణంతో పాటు ఊరూరా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయాల్లో పంచాంగశ్రవణం నిర్వహించారు. స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తిస్వామి పంచాంగశ్రవణం భక్తులకు వినిపించారు. ఏఏ రాశుల వారికి నూతన ఏడాది రాశి ఫలితాలను తెలియజేశారు. ఈ ఏడాది అధిపతి శని కావడంతో పంటలు సమానంగా పండుతాయన్నారు. సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించి ప్రకాశిస్తాడని తద్వారా లోకానికి మేలు జరుగుతుందని ప్రకృతిలో సహజంగా మార్పు వస్తుందన్నారు. బ్రాహ్మణులకు గోధుమలు దానం చేయడం ఎంతో శ్రేష్టమన్నారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగంణంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు బాలాజీ,అమరనాథ్‌శర్మ పంచాగశ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, ఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు. ఆయా రాశులవారీగా ఫలితాలు వివరించారు.నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. స్థానిక వాసవీభవన్‌వీధిలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు.

పితృదేవతలకు పూజలు :

ఉగాది పండుగ పురస్కరించుకుని ఇళ్లలో పిండి వంటకాలు చేశారు. ఉగాది పచ్చడి చేసి అందరికి పంచిపెట్టారు. పితృదేవతలకు నూతన బట్టలు పెట్టి పూజలు చేశారు. సమాధుల వద్దకు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం పూజలు చేశారు.

రామాలయంలో ఉగాది ఉత్సవాలు:

స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలోఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా మనందరికీ ఆరోగ్యం, జీవితంలో అనేక ఒడిదుడుకులు కష్టసుఖాలు అనుభవిస్తూ ఉంటామని ఏపియుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి అన్నారు. భారతీయులందరూ పాశ్చాత్య సంస్కృతిని వీడనాడి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్, సిద్దారెడ్డి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: పంచాగశ్రవణం చేస్తున్న అర్చకులు సాయిచక్రవర్తి



ఉగాది పచ్చడి అందజేస్తున్న ఏపీయూఎస్ సభ్యులు

ఉత్సాహంగా క్రోధినామ వేడుకలు

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా ఉగాది పర్వదినాన్ని షడ్రుచుల పచ్చడి ఆరగించి, కొత్త దుస్తులు ధరించి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులతో పంచాంగశ్రవణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం తిరుమాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

తంబళ్లపల్లె: మండలంలో ప్రజలు మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఇంటింటా ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో కలిగిన ఉగాది పచ్చడిని పంచుకున్నారు. మల్లయ్యకొండ ఆలయంలో మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు నూతన పంచాగాన్ని చదివి వినిపించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలుగ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకొన్నారు. మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పంచాంగ శ్రవణం కావించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన స్వామివారి వాహనంపై స్వామివార్లను కొలువుదీర్చి మేళతాళాలతో గ్రామపురవీధుల గుండా తిరుచ్చి(గ్రామోత్సవం) వైభవంగా నిర్వహించారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో పండురోజును పురస్కరించుకొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలువురు ఆలయఅర్చకులకు సన్మానం చేశారు. అమ్మవారికి రుద్రాభిషేకం, సహస్ర నామార్చనతో విశేష పూజలు చేశారు. గుర్రంకొండలో గ్రామదేవత శ్రీ గంగమ్మతల్లిని రంగరంగ వైభవంగా గ్రామపుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: మండల వ్యాప్తంగా ప్రజలు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్నానాన్ని ఆచరంచి సమీప ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు చోట్ల ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించి అనంతరం బంధు మితులకు పంచి పెట్టారు.





వాల్మీకిపురం : పట్టాభిరామాలయంలో పూజలు , గుర్రంకొండ: తరిగొండ ఆలయంలో పంచాంగ శ్రవణం కావిస్తున్న అర్చకులు, లక్ష్మీ నరసింహస్వామి వారికి తిరుచ్చి ఉత్సవం

క్లుప్తంగా

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కలకడ : ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండలంలోని శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రచాంగ శ్రవణం చదివి వినిపించారు. మండలంలోని కోన, గుడిబండ, కదిరాయచెర్వు, కలకడ, కె.బాటవారిపల్లెలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో జరగబోయే మంచిని, చెడును వేదపండితులు వినిపించారు.

భక్తులకు అన్నదానం



ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : ఉగాది పండుగను పురస్కరించుకుని సదుం మండలం బూరకాయలబండలో వెలసిన మహాచాముండేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం పీలేరు ఆర్టీసీ బస్టాండ్‌లో భక్తులకు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పి. విజయకుమార్ మాట్లాడుతూ అమ్మవారి కృపతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



విశేష అలంకరణలో ఎల్లమ్మ

కలికిరి: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాదిని పురస్కరించుకుని కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సోమేశ్వరాలయంలో అర్చకులు రామచంద్రశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిలు ఉగాది పంచాంగం పఠనం చేశారు. సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఇంట్లో పూజలు, పెద్దలకు బట్టలు పెట్టి పూజలు నిర్వహించుకున్నారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవలు విస్తరింపచేస్తాం



మాట్లాడుతున్న రిటైర్ట్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

పీలేరు : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవలు విస్తరింపచేస్తామని రిటైర్ట్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలోని పీఎల్ఆర్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో పీలేరు, తలపుల, రేగళ్లు, కలకడ, కేవీపల్లె గ్రామీణ ఖండల తరుణ గణవేష్‌దారి స్వయంసేవకులతో ఉగాది ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తిరుపతి విభాగ్ ప్రచారక్ మల్లికార్జున, ఆర్ఎస్ఎస్ నాయకులు మధు, శేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, బాలసుబ్రమణ్యం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

లింగాలకు ఉగాది పురస్కారం

మదనపల్లె సిటీ: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మన మాతృభాష తెలుగు సాహిత్య సామాజిక అంతర్జాల మాసపత్రిక నిర్వహించిన కవితల పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారికి ఉగాది పురస్కారం లభించింది. ఈ మేరకు సాహిత్యపత్రిక సంపాదకులు కవిత చిత్ర సమాచారం పంపారు. యుగంధర్‌కు మరసం సభ్యులు అభినందించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు




తిరువర్రూర్ కమలాంబిక అలంకరణలో చౌడేశ్వరి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలకరించారు. వివిధ రకాల పూలతో ముస్తాబు చేశారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు,బైపాస్ రోడ్డు, గొల్లపల్లి ప్రాంతాలకు రద్దీ ఏర్పడింది. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. అమ్మవారు తిరువర్రూర్ కమలాంబిక అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామిలను కూడా ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారిని దీలు, బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. తొగటవీరక్షత్రియులు జ్యోతులను తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం ఉట్ల తిరుణాల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు రామచంద్ర, బండి నాగరాజ, ప్రభాకర్, లోకేష్, పురం రమణ తదితరులు పాల్గొన్నారు. సి.ఐలు వల్లిబసు, యువరాజ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి, ప్రతి ఇల్లు కలకలలాడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ కొత్త సంవత్సరం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయపథంలో నడిచి పేద ప్రజలకు సంక్షేమ పథకాల అందించడమే ధ్యేయంగా సాగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సతీమణి నీరజ, కోడలు శ్రేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతల

సామాజిక స్పృహతో రాసే కవిత్వం సజీవం

మదనపల్లె సిటీ: సామాజిక స్పృహతో కవిత్వం రాస్తే సమాజంలో ఎప్పుడూ బతికి ఉంటుందని ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక చిత్తూరు బస్టాండులోని బొంతలవారి కల్యాణ మండపంలో మంగళవారం మదనపల్లె రచయితల సంఘం(మరసం) 26వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాది రోజు కవి కోయిలకు మరసం వేదిక అయ్యింది. ఆయన మాట్లాడుతూ నేడు కవిత్వం కొత్త పుంతలు తొక్కుతోందని, ఇది ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. సాహితీలోకంలో మరసం ద్వారా క్రమం తప్పకుండా ఉగాది కవిసమ్మేళనాలు, సాహితీసభలతో సాహితీసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన కరణం బాలసుబ్రమణ్యంపిళ్లై,మల్లెల గురువయ్యను అభినందించారు. మదనపల్లె, పుంగనూరుకు చెందిన కవులు క్రోధి నామసంవత్సరంపై కవితలు వినిపించారు.




కవులను సన్మానిస్తున్న మరసం సభ్యులు, ఆకట్టుకున్న పంతులు-మెంతులు నాటిక దృశ్యం

కవులను మరసం గౌరవ అధ్యక్షులు పురాణం త్యాగమూర్తిశర్మ కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మరసం సహాయ కార్యదర్శి రామమోహన్‌నాయుడు,తోకల సిద్దయ్య, శ్రీనివాసులు,ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పంతులు-మెంతులు నాటకం:

మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి రచన, దర్శకత్వంలో పంతులు-మెంతులు నాటకం అందరిని ఆకట్టుకుంది.నాటికలో పంతులుగా నాగభూషణరావు తన నటనతో అందరిని ఆకట్టుకున్నారు. ఆదత్యం నాటకం హాస్యంతో అలరించింది.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పీలేరు : స్థానిక చిన్నారి హాస్పిటల్ సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కింది భాగానం పెట్టడం, చుట్టూ ఉన్న ఇనుపకంచె తెరచి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పశువులు గ్రాసం మేస్తూ అటువైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైప్‌లైన్లు మరమ్మతు చేయాలి

మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె 35వవార్డు మారుతీనగర్‌లో దెబ్బతిన్న పైప్‌లైన్లను వెంటనే మరమ్మతుచేసి, ప్రజలకు నీటిసౌకర్యం పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం మారుతీనగర్‌లో నీటికోసం కాలనీవాసులు పడుతున్న కష్టాలను స్వయంగా చూసిన ఆయన మీడియాతో మాట్లాడారు. వాటర్ పైప్‌లైన్‌లు దెబ్బతిని మూడురోజులవుతున్నా వాటికి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేయకుండా, మున్సిపల్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి మిన్నకుంటున్నారన్నారు. గతంలోనూ ఇలాగే పైప్‌లైన్లు దెబ్బతిన్నప్పుడు మరమ్మతుల కోసం గోతులు తవ్వి వారంరోజుల పాటు రిపేరీ చేయకుండా ఎప్పటికో సరిచేసిన సందర్భం మారుతీనగర్‌లో జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు ఈసారైనా..తక్షణమే దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేసి, ఇంటింటికీ మంచినీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు.



మారుతీనగర్‌లో నీటి కోసం క్యూలో ఇలా..

మేత కోసం అలమటిస్తున్న మూగజీవాలు

- అంగళ్లు మల్లయ్య కొండపై మౌన రోదన
- దేవుని పశువులకు గ్రాసం కొరత
- దాతల కోసం ఎదురు చూపు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై మూగజీవాలు మేత లేక అలమటిస్తున్నాయి. కోరికలు తీరిన వారు..కష్టాల నుంచి బయట పడినవారు..మొక్కుబడి తీర్చుకున్న వారు ఆలయానికి గోవులను తోలారు. మరి కొందరు గోవులను దానంగా ఇంకొందరు కానుకగా ఇచ్చారు. మరికొన్ని పుట్టినవి ఉన్నాయి. 15 ఏళ్లుగా ఇక్కడ గోకులాన్ని తలపించేలా ఉన్నాయి. చిన్నవి పెద్దవి 42 దాకా ఉన్నాయి. ఇన్నేళ్లుగా వీటిని ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి అవస్థలు పడి మేపుతూ వచ్చారు. దీనికి తోడు మల్లయ్య కొండతో పాటు పరివాహక గుట్ట ప్రాంతాల్లో ఇవి మేతకు వెళ్లి తిరిగి సాయంత్రం గుడి వద్దకు చేరుకునేవి. నెల క్రితం మల్లయ్యకొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొత్తం కాలిపోయింది. దీంతో పచ్చి మేత చూద్దామన్న కన్పించడం లేదు. దీనికి తోడు మండే ఎండలు భీకరంగా ఉన్నాయి. రైతుల వద్ద కూడా ఆశాజనకంగా గ్రాసం లేదు. వీటి పరిస్థితి చూస్తే మనసును కదిలించి వేస్తోంది. ఫీడు, బుస, తౌడు లాంటి వాటితో కాలం వెల్లదీస్తున్నారు. కనుచూపు మేరలో ఎక్కడా గడ్డి లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో వీటిని కట్టేసి మేపాల్సి వస్తోంది. మల్లయ్య కొండకు వచ్చే భక్తులు, సందర్శకుల వైపు ఏమైనా లభిస్తుందా అని దయనీయంగా చూస్తున్నాయి. కొండకు వచ్చే కొందరు వీటి బాధను చూడలేక వెంట తెచ్చుకున్న పండ్లు, ఫలహారాలను అందిస్తున్నారు. రాజస్థాన్ నుంచి ఈ ప్రాంతానికి వలస వచ్చిన కొందరు యువకులు కూడా అప్పుడప్పుడు వచ్చి గోవులను కడిగి బెల్లం నీళ్లు తాపి వెళుతున్నారు. ప్రధానంగా గడ్డి లేక మూగజీవాలను మేపడానికి దినదిన గండంగా మారింది. గడ్డితో పాటు గో సంరక్షణకు సాయం చేయదలచిన వారు 9959656139 సెల్ నెంబరుకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆలయ కమిటీ కోరింది.



మేత కోసం అలమటిస్తున్న మల్లయ్యకొండ గోవులు

దాతలు ఆదుకోవాలి



గత 15 ఏళ్లుగా ఇక్కడి గోవుల సంరక్షణ చూస్తూ వచ్చా. వేసవి ఆపై అంగళ్లు మల్లయ్యకొండను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేయడంతో పశువులకు గడ్డి కొరత తీవ్రంగా మారింది. ఆలయానికి ఆదాయ వనరులు కూడా లేవు. దేవుని గోవుల బాధ రోదన చూస్తుంటే హృదయం ద్రవించి పోతుంది. నీరసించి పోతున్న వాటి దయనీయ స్థితికి మనసు కరిగిపోతుంది. గోసేవకులు, గోవులను ప్రేమించేవారు, నాయకులు, దాతలు వీటి సంరక్షణకై తమ వంతు చేయూతను ఇవ్వాల్సి ఉంది. పశు గ్రాసంతో పాటు దాణా, ఫీడు, బుస లాంటి వాటిని ఇచ్చి మనసున్న వారు, సాయం చేసే చేతులు ఆదుకోవాల్సి ఉంది.

-కాకర్ల కృష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్, అంగళ్లు మల్లయ్యకొండ

నియమావళి మరచిన అధికారులు

కలికిరి: ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నేతల ఫొటోలు, శిలాఫలకాలు కనపడకుండా సంబంధిత అధికారులు కప్పి ఉంచాలి. అయితే మండలంలోని పల్లవోలు గ్రామంలో 28-02-2009న కిరణ్ కుమార్ రెడ్డి ఆవష్కరించిన శిలాఫలకం అలాగే దర్శనమిస్తుండటంతో అధికారుల అలసత్వంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల నియమావళి అందరికి వర్తిస్తుందని, నిబంధనల ప్రకారం శిలాఫలకం కప్పి ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పల్లవోలులో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుతో శిలాఫలకం

ఘనంగా మంచాలమ్మ తిరునాల

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ తల్లి తిరునాల గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట శాసనసభ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంచాలమ్మను సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవానికి కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు హాజరు కావడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున పొంగళ్లను సమర్పించారు.

మేకపోతులు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచుగారిపల్లి గ్రామంలో మేక పోతులు కనిపించలేదని మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే మండలంలోని ఒంటిమిట్ట మేజర్ పంచాయతీలోని చెంచుగారిపల్లి గ్రామానికి చెందిన చింగారపు చిన్నవెంకట సుబ్బారెడ్డి, శివనాగేంద్ర అనే బాధితులకు సంబంధించిన చెరో రెండు మేక పోతులు కొన్ని రోజుల క్రితం కనిపించకుండా పోవడంతో ఒంటిమిట్ట గ్రామ పరిసర ప్రాంతాలలో వెతికినా దొరకకపోవడంతో చేసేది ఏమీలేక స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.